క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ గణేష్‌పురి, హయత్‌నగర్, మదర్‌డెయిరీ, హుడాకాంప్లెక్స్, డెంటల్ కాలేజి ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, సామనగర్, కల్వంచ, పసుమాముల, గౌరెల్లి, తారామతిపేట, రాక్‌హిల్స్, విష్ణు థియేటర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సరూర్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గంగ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనుంది.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మీర్‌పేట: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని నిషేధించాలి రవీంద్రభారతి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కుముదవల్లి పిలుపునిచ్చారు. భూమి వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్వంలో జీవరాశి మనుగడకు భూమి మాత్రమే అత్యంత ఆవశ్యకమైన గ్రహమన్నారు. ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి హాని కలిగి భవిష్యత్తులో జీవరాశి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందనరి తెలిపారు. కావునా, ప్రతి పౌరుడు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డుసభ్యురాలి రాజీనామాకు ఆమోదం

ఆమనగల్లు: మాడ్గుల మండలం పల్లుగతండా గ్రామ పంచాయితీ 7వ వార్డు సభ్యురాలు జటావత్ హస్లీ రాజీనామాను ఆమోదించినట్లు మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇర్విన్ మండలంలో కాకుండా పల్లుగతండాను మాడ్గుల మండలంలో కొనసాగించాలని కారణం చూపుతూ వార్డు సభ్యురాలు హస్లీ రాజీనామా చేశారని.. ఈ మేరకు ఆమె రాజీనామాను ఆమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన నరేందర్‌కు రూ.లక్ష సీఎంఆర్ ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం ఎమ్మెల్సీ నారాయణ్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. ఖానాపూర్‌కు చెందిన చంద్రారెడ్డి (76) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కొరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

19న సర్వసభ్య సమావేశం

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

200 మందికి ఒక్కరే వైద్యుడు

- సాధారణ చికిత్సలు మొదలు.. కాన్పుల వరకు..
- కోవిడ్ పరీక్షల నుంచి టీకాల వరకు అన్నింటికి ఆమె దిక్కు
- డాక్టర్లుగా స్టాఫ్ నర్సులు, ఇతర పారామెడికల్ స్టాఫ్ సేవలు



వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం అవుట్ పేషెంట్ విభాగానికి రోజుకు 150-200 మంది రోగులు వస్తుంటారు. వీరిలో నెలలు నిండిన గర్భిణులతో పాటు కుక్కకాటు బాధితులు, కరోనా, డెంగీ జ్వర పీడితులు ఉంటారు. రోగుల సరిపడ మంది వైద్యులు లేకపోవడంతో ఉన్న ఒక్క వైద్యురాలిపై ఒత్తిడి తప్పడం లేదు. సాధారణ చికిత్సలు మొదలు కాన్పుల వరకు అన్ని సదరు వైద్యురాలే చూసుకోవాల్సిన పరిస్థితి. ఫలితంగా రోగులకు సకాలంలో వైద్య సేవలు అందకుండా పోతున్నాయి. సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతుండడంతో రోగం మరింత ముదిరి వారి ప్రాణాలమీది కొస్తోంది. అంతేకాక ఆస్పత్రి పరిధిలో 12 బస్తీ దవాఖానాలు, మరో ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఐదు అర్బన్ హెల్త్ సెంటర్‌ల్లో ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వాటిలో వైద్యులు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్యులుగా చికిత్సలు అందిస్తున్నారు. కుక్కకాటు, పాముకాటు బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్ధరాత్రి అత్యవసర పరిస్థితుల్లో ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు పరుగెత్తాల్సి వస్తుంది.

కోవిడ్ పరీక్షలకు తప్పని ఇబ్బంది

ఆస్పత్రి జీహెచ్ఎంసీ పరిధిలో ఉండడం వల్ల చుట్టుపక్కల ఉన్న వారంతా ఇక్కడికే వస్తుంటారు. కోవిడ్ పరీక్షల కోసం కాకుండా కోవిడ్ టీకాల కోసం వందలాది మంది వస్తుంటారు. రోగ నిర్ధారణ పరీక్షల రిపోర్టుల జారీ సహా మందులను సూచించడంలో జాప్యం జరుగుతుంది. వ్యాక్సినేషన్ కోసం ఉదయం నుంచే క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తుంది. రోగులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు లేకపోవడం కూడా ఇబ్బందిగా మారింది.


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆసుపత్రి

రోజు సగటు ఓపీ- 150-200
పడకల సామర్థ్యం - 60
నెలకు చేసే ప్రసవాలు- 18-20
అందుబాటులో ఉన్న వైద్యులు-ఒకరు, యూనాని డాక్టర్ ఒకరు, ఆయుర్వేద డాక్టర్ ఒకరు
రెగ్యులర్ స్టాఫ్ నర్సులు- ఒకరు, మరో నలుగురు అవసరం.
ఆస్పత్రికి అవసరం ఉన్న వైద్యులు- మరో ఇద్దరు
ఇతర పారామెడికల్ స్టాఫ్- 29 ఉన్నారు. మరో నలుగురు అవసరం

ఇద్దరు వైద్యులను కేటాయిస్తే సరి



ఆస్పత్రికి మరో ఇద్దరు వైద్యులను కేటాయిస్తే రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించొచ్చు. సేవల్లో జాప్యం లేకుండా చూడొచ్చు. ఒకరు సెలవులో ఉన్నా మరో ఇద్దరు అందుబాటులో ఉండే అవకాశం ఉండడంతో రోగులకు సత్వర సేవలు అందుతాయి. ఆస్పత్రిలో మందుల కొరత లేదు. వ్యాక్సినేషన్ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోంది.

-డా.అర్చన, మెడికల్ ఆఫీసర్

రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి


రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి

బడంగ్‌పేట్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేకి అని కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. గురువారం బడంగ్‌పేట చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడుతూ.. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తూ రైతులకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని అన్నారు. ఉచిత విద్యుత్ అండతోనే పచ్చని పంటలు పండించి దేశంలోనే తెలంగాణను రైతన్నలు ముందు వరసలో నిలబెట్టుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి రైతుల పాలిట శాపంగా మారడని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, కార్పొరేటర్లు రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జంగారెడ్డి, ఆనంద్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కర్రెకృష్ణ, సంతోష్, సింహారెడ్డి, రమేష్, మహిళా నాయకులు సరిత, గీత, అరుణ్‌జ్యోతి, హేమలత, గాయత్రి, డానియల్ తదితరులున్నారు.

ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవులు



సమావేశంలో మాట్లాడుతున్న కేశవులు

తుక్కుగూడ : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.కేశవులు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో 6వేల మంది ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించి, సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయ బదిలీల విషయం న్యాయస్థానంలో ఉన్నందునా, గత తొమ్మిదేళ్లగా నుంచి ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పదోన్నతులు వెంటనే చేపట్టి, నూతన పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కందుకూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, కారోబార్లు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గెలుపొందిన వారితో చైర్మన్ విఠల్‌రెడ్డి, ఉపాధ్యాయులు

విద్యాసంస్థల చైర్మన్ విఠల్‌రెడ్డి

మీర్‌పేట: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు తమ పాఠశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి తెలిపారు. మీర్‌పేట నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ పాఠశాలలో గురువారం జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల ప్రమాణస్వీకారోత్సవానికి విఠల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన విద్యార్థులకు బ్యాడ్జీలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ద్వారా విద్యార్థుల్లో ప్రజాస్వామ్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థల్లో చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా విద్యార్థులకు బోధన, శిక్షణ అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్, ఇన్‌చార్జిలు దుర్గ, సంధ్య, ప్రశాంతి, రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

మీర్‌పేట: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మీర్‌పేట కార్పొరేషన్ 36వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ గురువారం మంత్రి సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధి విశాల్‌మార్ట్ నుంచి మహేశ్‌నాయక్ ఇంటి వరకు, ఎంఎల్ఆర్ కాలనీ రోడ్డు నం-4 నుంచి 5 వరకు, తిరుమల ఎన్‌క్లేవ్‌కాలనీలో సీసీరోడ్లు, అదేవిధంగా అనురాగ్‌నగర్ కాలనీ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరగా, స్పందించి రూ.35 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

కడ్తాల్: మండలంలో నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొంది ఉండి, 18 నుంచి 59 సంవత్సరాల్లోపు రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో సంబంధిత క్లస్టర్ కార్యాలయంలో ఆగస్టు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా గతంలో రైతుబీమా చేయించుకున్న రైతులు ఆధార్ కార్డుల్లో ఏమైనా మార్పులు ఉన్నా, నామినీ మార్చాలనుకున్నా సంబంధిత ఏఈఓను సంప్రదించాలని కోరారు.

బోనాల ఉత్సవాలకు రోడ్ల మరమ్మతులు



మట్టితో రోడ్లను చదును చేస్తున్న దృశ్యం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో వచ్చే ఆదివారం బోనాల సంబురాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, కట్ట మైసమ్మ, మహంకాళి అమ్మవార్ల అలయాలను ముస్తాబు చేస్తున్నారు. 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో అక్కడక్కడ రోడ్లు బాగులేక పోవడంతో స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. బోనాల ఉత్సవాలకు అంతా సిద్ధం చేస్తున్నామని గ్రామ పెద్దలు మల్లారెడ్డి, సంజీవరెడ్డి, జంగారెడ్డిలు వెల్లడించారు.

రూ. వందల కోట్లతో జల్‌పల్లి అభివృద్ధి

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి


సీసీ రోడ్డు పనులశంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: వందలాది కోట్ల రూపాయల వ్యయంతో జల్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరుగుతుందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7,8,9,10,24 వార్డుల్లో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో ఒక్కో వార్డుకు రూ.80 లక్షల చొప్పున వ్యయంతో అన్ని వార్డుల్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా హెచ్ఎండీఏ ద్వారా రూ.4 కోట్లు కేటాయించారన్నారు. రూ.100 కోట్లతో మున్సిపాలిటీలో జలమండలి పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని వెల్లడించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. మిషన్ కాకతీయతో చెరువులను నింపి వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి కౌన్సిలర్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కమిషనర్ వసంత, కౌన్సిలర్లు శంషాద్దీన్, మజ్హర్ అలీ, లక్ష్మీనారాయణ, శంకర్, కోఆప్షన్ మెంబర్ కృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, జనార్దన్, షేక్ అఫ్జల్, దస్తగిర్, ఖదీర్, ఉమర్ బామ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఖాద్రీకాలనీలో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు త్వరలోనే సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చారు.


పోచమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామపెద్దలు


అందెలను సన్మానిస్తున్న బాలాపూర్‌వాసులు

ఘనంగా బోనాల ఉత్సవాలు

నియోజకర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో గురువారం ఘనంగా బోనాల ఉత్సవాలు జరిపారు. డప్పుల చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజు విన్యాసాలతో బోనాల ఊరేగింపు సాగింది. అనంతరం మహిళలు అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. -సాక్షి,నెట్‌వర్క్


బడంగ్‌పేట్: బంగారు మైసమ్మ అమ్మవారి దర్శించుకున్న మంత్రి సబితారెడ్డి


బోనమెత్తిన మేయర్ పారిజాత


అమ్మవార్లను దర్శించుకుని టీపీసీసీ ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, తదితరులు


వీరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

రోడ్లపై వాహనాలతో సర్కస్ ఫీట్లు చేస్తే జైలుకే..

వనస్థలిపురం సీఐ హెచ్చరిక

హస్తినాపురం: యువకులు రోడ్లపై సర్కస్ ఫీట్లు చేస్తూ అజాగ్రత్తగా ద్విచక్రవాహనాలను నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం వనస్థలిపురం పరిధిలో సాయంత్రం ముగ్గురు బాలురు ఇతరులకు ఇబ్బంది కలిగేలా వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా సీఐ జలేంధర్‌రెడ్డి మాట్లాడుతూ, యువకులు ద్విచక్ర వాహనాలపై రాష్ డ్రైవింగ్, సింగల్ వీల్, జిగ్‌జాగ్ డ్రైవింగ్, అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వినియోగించడం, త్రిబుల్ డ్రైవింగ్, వాహనాలను నడుపుతూ ఒక్కసారిగా కటింగ్ కొట్టి తోటి వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపటం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇందులో భాగంగానే ద్విచక్రవాహనాలను అజాగ్రత్తగా నడుపుతూ పట్టుబడ్డ ముగ్గురు మైనర్లపై కేసు నమోదు చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు మైనర్లుకు వాహనాలను ఇవ్వొద్దని సీఐ జలేంధర్‌రెడ్డి సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు.


రోడ్లపై త్రిబుల్ రైడింగ్ చేస్తున్న మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు